
www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 17 అక్టోబర్ 2025

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్

కోనసీమ

పంట కాలువల ఆధునికీకరణకు చర్యలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

గోదావరి తూర్పు డెల్టా పరిధిలోని పంట కాలువలను ఆధునికీకరించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కుమార్ తెలియజేశారు. గురువారం నియోజకవర్గంలోని లాకులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూర్పు డెల్టా ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 20 లాకులు ఉన్నాయని, సుమారు రూ.కోటితో మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉందని, దీనిపై నివేదిక తయారుచేసి సిఎం, ఇరిగేషన్ మంత్రులకు అందజేస్తామన్నారు. కాలువలలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఆక్రమణలు పెరిగిపోవడంతో వాటిని నిరోధించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తూర్పు డెల్టా పరిధిలోని 210 కాలువలను పూడిక తీయించడానికి ఆధునికీకరించడానికి రూ.8.30కోట్లు డ్రెయినేజీ పరిధిలో 147 పనులకు రూ.ఐదు కోట్లు వెచ్చించామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు డిసిలు పాల్గొన్నారు.

ఇళ్ల మీటర్లతోనూ స్మార్ట్ షాక్


- గృహ వినియోగదారులపై స్మార్ట్ మీటర్ల భారం
- చాపకింద నీరులా 200 పైగా గృహ వినియోగ కనెక్షన్లు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

ప్రభుత్వం ఆదేశం మేరకే గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగిస్తామని చెబుతున్న అధికారులు చాప కింద నీరులా తమ పనిని నెమ్మదిగా పూర్తి చేసేస్తున్నారు. పారిశ్రామిక వ్యాపార సముదాలకు మాత్రమే స్మార్ట్ మీటర్లు బిగిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం క్రమముగా గృహ వినియోగదారులపై దృష్టి సారించింది. సఖినేటిపల్లి మండల పరిధిలో గత కొన్ని నెలలుగా గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రక్రియను విద్యుత్ శాఖ అధికారులు సైలెంట్‌గా తమ పనిని కొనసాగిస్తున్నారు. ఇప్పటికే మండల పరిధిలో సుమారు రెండువేల పైబలుకు గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు జరిగిపోయింది. గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించే ముందు వారి అనుమతి తప్పనిసరిగా తీసుకుని ఏర్పాటు చేస్తామని వారు వద్దంటే స్మార్ట్ మీటర్లే బిగిస్తామని రెండు నెలల క్రితం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక పత్రికా ప్రకటన చేశారు. అయితే మండలం నుండి చాలామందికి స్మార్ట్ మీటర్ల పై అవగాహన లేకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు, స్మార్ట్‌మీటర్లకు సంబంధించిన ప్రయివేటు ఏజెన్సీతో కలిసి తమపనిని చాకచక్యంగా ముగిస్తున్నారు. సఖినేటిపల్లి మండలంలో సుమారు 25 వేల విద్యుత్ వినియోగదారులు ఉండగా, వీరి ద్వారా సుమారు రూ.నాలుగున్నర కోట్ల పైబలుకు ఆదాయం విద్యుత్ శాఖకు లభిస్తుంది. దీనిలో ఆక్వా చెరువులు, వ్యాపార సముదాయాలు ప్రధాన ఆదాయ విద్యుత్ కనెక్షన్లు కాగా మిగిలినవి గృహ వినియోగదారులు. సఖినేటిపల్లి మండలంలో గల 25,000 విద్యుత్ మీటర్ కనెక్షన్లలో 1 నుంచి 2 శాతం నెల వారీగా స్మార్ట్ మీటర్లలో లోపాలు తలెత్తడం లేదా వివిధ రూపాలలో మీటర్ల డ్యామేజీలు జరుగుతుంటాయి. అంటే సుమారు 250 నుంచి 500 మధ్యలో ప్రతి నెల మీటర్లు మార్పు అవసరమై, కొత్త మీటర్లు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ఈ మీటర్ల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా సాధారణ విద్యుత్ మీటర్లకు బదులుగా విద్యుత్ అధికారులు స్మార్ట్ మీటర్ ఏజెన్సీలు సంయుక్తంగా గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు కావడంతో, స్మార్ట్ మీటర్ల పనితీరుపై గాని ఇతర అంశాలపై అవగాహన లేకపోవడం చాలా మంది వీటిపై అవగాహన లేకుండానే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయించుకుంటున్నారు. గత వైసిపి ప్రభుత్వం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ విధానం ప్రారంభమైనప్పుడు, కూటమి నాయకుల్లో లోకేష్ స్మార్ట్ మీటర్లను నేలకేసి పగలగొట్టమని పిలుపునివ్వడం సంగతి తెలిసిందే. అయితే ఇదే కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం పెరుగుతూ టిఒడి విధానంలో స్మార్ట్ మీటర్ల పనితీరును కొనసాగిస్తూ ప్రజల నెత్తిన భారం మోపుతున్నారు. యూరప్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అమలవుతున్న విధానాన్ని తీసుకువచ్చి అభివృద్ధికి ఆమడ దూరం ఉన్న భారత ప్రజలపై కేంద్ర ప్రభుత్వం బలవంతంగా మోపడాన్ని ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అదాని, షిరిడి సాయి ప్రయివేటు సంస్థలు స్మార్ట్ మీటర్ల ఒప్పందం దాన్ని కుదుర్చుకున్నాయని, గృహ వినియోగదారులకు వినియోగించే స్మార్ట్ మీటరుకు రూ. 9000, త్రీఫేస్ విద్యుత్ వినియోగదారుల స్మార్ట్ మీటర్లు రూ.17వేల మీటర్ చార్జీలను సైతం నెలవారి వాయిదాల పద్ధతిలో వినియోగదారులు చెల్లించాల్సిరావడం అన్యాయమని, మానవ హక్కుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల శ్రీనివాస్ వాపోయారు. టైమ్ ఆఫ్ డే పేరుతో ఒకే రోజులో మూడు రకాల విద్యుత్ టారీఫ్ లను వేయడం దారుణమన్నారు.

వినియోగదారులతో అనుమతితోనే వేస్తున్నాం

దీనిపై సఖినేటిపల్లి మండల ఎలక్ట్రికల్ ఎఇ ప్రసాద్ ని వివరణ కోరగా 200 యూనిట్లు దాటిన వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను ప్రిఫర్ చేస్తున్నామని అది కూడా వారి అనుమతి మేరకే ఏర్పాటు చేస్తున్నామని, బలవంతం చేయడం లేదని ఆయన తెలిపారు. సఖినేటిపల్లి మండలంలో వెయ్యికి పైగా గృహ వినియోగదారులకు వారి అనుమ తితో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశామని, ఎవరిని బలవంతం చేయడం లేదని ఆయన పేర్కొన్నారు.



స్మార్ట్ మీటర్

తక్షణమే నిలిపివేయాలి



ఈ విధానంతో అదాని, మోడీ, బాబు, పవన్, జగన్లకు లబ్ధి చేకూర్చే మీటర్లు ఇవి. అప్పటి వైసిపి ప్రభుత్వం విధానాలను నేడు కూటమి ప్రభుత్వం అమలు చేయడం దారుణం. సాధారణ గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల విధానాన్ని తక్షణమే నిలిపివేయాలి.

-జాన్ భూషి, బిఎస్‌పి, అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు

కార్యాచరణ చేపడతాం



గ్రామీణ ప్రాంతంలో అవగాహన లేమి తో ఉన్న గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను అంటగట్టి ప్రయివేట్ సంస్థలకు విద్యుత్ అధికారులు కొమ్ముకాయడం దారుణం. స్మార్ట్ మీట ర్లను గృహ వినియోగదారులకి అంటగట్టడాన్ని ఖండి స్తున్నాం. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యాచరణ చేపడతాం.

-ముత్యాల శ్రీనివాస్, మానవహక్కుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు

ఘనంగా క్రీడోత్సవాలు నిర్వహించాలి

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని కలిగించేలా, కోనసీమ క్రీడోత్సవాలు క్రీడా స్ఫూర్తిని చాటేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు విద్యాశాఖ అధికారులు మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నవంబర్ మొదటి వారంలో ప్రాథమిక స్థాయి క్రీడా పోటీలను మండల స్థాయిలోనే పూర్తి చేయాలని, 6 వ తరగతి నుంచి ఇంటర్ వరకు క్రీడా పోటీలను జిల్లా స్థాయిలో నవంబరు 12, 13 ,14 తేదీలలో స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియం నందు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో ప్రాథమిక, ఉన్నత స్థాయి పాఠశాల విద్యార్థుల క్రీడోత్సవాలలో అండర్-14, అండర్-17 విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకొని క్రీడా ప్రతిభను చాటుకోవాలన్నారు. కోనసీమ ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 6, 7, 8 తరగతులు జూనియర్ బ్యాచ్‌గాను 10 ఇంటర్ తరగతులు సీనియర్ బ్యాచ్ గాను విభజిస్తారన్నారు. వివిధ రకాల కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు అన్ని రకాల పోటీలు నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఈ క్రీడోత్సవాలలో కలిపి నిర్వహించాలన్నారు. మార్గదర్శకాల ప్రకారం, కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులుగా ఉన్నవారికే అర్హత ఉంటుందన్నారు. మండల స్థాయి పోటీలు విద్యార్థులను ఎంపిక చేయడానికి మొదట మండల స్థాయిలో క్రీడలు పోటీలు నిర్వహించి బహు మతులు ప్రధానం చేయాలన్నారు. అండర్-14 మరియు అండర్-17 కేటగిరీల్లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్ వంటి పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ క్రీడా పోటీలకు భోజనం వసతులు క్రీడా పరికరాలు కొరకు నిధులు కలెక్టరేట్ నుంచి సమకూర్చుతామన్నారు. క్రీడా పోటీలు పారదర్శకంగా నిర్వహించేందుకు అనుభవజ్ఞులైన హెచ్‌ఆర్లు నియమించడంతోపాటు లాజిస్టిక్స్ సమకూర్చు కోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి టి.నిశాంతి, సమగ్ర శిక్ష ఎపిసి జి.మమ్మీ, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖ అధికారి బివి. సుబ్రహ్మణ్యం, వ్యాయామ ఉపాధ్యాయు లు భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

వైసిపి కోటి సంతకాల సేకరణ ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేయాలన్న నిర్ణయాన్ని వైసిపి తీవ్రంగా ఖండిస్తూ, ప్రజా ఉద్యమ కార్యాచరణను మొదలుపెట్టింది. అందులో భాగంగా వైసిపి రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ పట్టణంలోని గుబ్బలవారిపేట 27వ వార్డులో 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమం గురు వారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు వివరించాలని, మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణ, నకిలీ మద్యం తయారీ వంటి కార్యక్రమా లతో ప్రజా రోగ్యం దెబ్బతింటుందని ఇటువంటి విధానాలు విధా నాడాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా 27వ వార్డులో ప్రజలతోనూ, వ్యాపారుతోనూ కోటి సంతకాల ప్రారంభిం చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాధంశెట్టి శ్రీధర్, అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, నాయ కులు గుబ్బల గణ, దంగేటి వీరభద్రరావు, నున్న బోయిన శ్రీరాములు, రెడ్డి రాజు, రామచంద్రపురం మండల కన్వీనర్ పోలినాటి ప్రసాద్, సోషల్ మీడియా అధ్యక్షులు పాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభించిన పిల్లి సూర్యప్రకాష్

పోషకాహారంతోనే ఆరోగ్య సంరక్షణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గర్భిణులు, బాలింతలు పోషకాహారంతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ముమ్మిడివరం ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.నిహారిక పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నందు గురువారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవ ముగింపు వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నిహారిక మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలలో ఎదురయ్యే రక్తహీనతను అధిగమించేందుకు పోషక విలువలు ఉన్న సంతులిత పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఉత్తమం అన్నారు. అలాగే సరైన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఊబకాయాన్ని అదుపు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన 42 రకాల పోషక విలువలతో కూడిన పిండి వంటలను ప్రదర్శించారు అలాగే ఇటీవల బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పెయింటింగ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీలలో విజే తలైన బాలికలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నిడి వెంకటేశ్వరరావు, గర్భిణీలు, బాలింతలు మరియు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.




చైర్మన్ ఈశ్వరతో శాలివాహన నాయకులు

చేతి వృత్తులకు ఆర్థిక చేయూతనివ్వాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

చేతివృత్తులకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిచ్చి ప్రోత్సహించాలని శాలివాహన సంక్షేమ మరియు అభివృద్ధి రాష్ట్ర చైర్మన్ పేరేపి ఈశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. మాచవరంలో సంఘం నందు జిల్లా డైరెక్టర్ మాచవరం విజయ్‌కుమార్‌తో కలిసి శాలివాహనుల ఆర్థిక స్థితిగతులు తెలుసుకున్నారు. గంగలకుర్రులో శాలివాహనులను కలిశారు. కుండల తయారీకి ముడి సరుకు, మట్టి సేకరణ సమస్య ఎక్కువగా ఉందని సంఘం నాయకులు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు.తమ చేతి వృత్తుల మనుగడకు అవసరమైన మట్టి లభ్యతకు భూములు కేటాయించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని సంఘ నాయకులు కోరారు. శాలివాహనులకు మళ్లీ పూర్వపు వైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా చైర్మన్ భరోసా కల్పించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి, యూత్ నాయకుడు పాలకొల్లు వెంకటరమణ, చిరుతపూడి వెంకటేశ్వరరావు, దుర్గారావు, వ్యవస్థాపక కమిటీ సభ్యులు మానేపల్లి రామ కృష్ణ, కాపవరపు శేషగిరి, వెల్లా త్రిమూర్తులు, కొడమంచిలి సూరిబాబు, ర్యాలీ రామకష్ణ, మానేపల్లి నాగరాజు, చిరుతపూడి హేమలత, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



మోడరన్ హ్యుమానిటీ క్లబ్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు ఆధ్వర్యంలో రూపొందించిన మోడరన్ హ్యుమానిటీ క్లబ్ లోగోను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆవిష్కరించారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌కు జివి.రావు హ్యుమానిటీ క్లబ్ విధివిధానాలు వివరించారు. అన్నా ర్థులకు మోడరన్ ఫ్యామిలీ సహకారంతో ఆహారాన్ని అందజేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు రావు వివరించారు. ఈ సందర్భంగా జివి.రావు మాట్లాడుతూ మోడరన్ ఫౌండేషన్‌కి అనుబంధంగా యూని వర్సల్ సింగల్ ఫ్యామిలీ అనే భావనతో మోడరన్ హ్యుమానిటీ క్లబ్‌కి శ్రీకారం చుట్టామని వివరించారు. మోడరన్ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, ఉద్యోగులు, శ్రేయోభి లాషులు, సన్నిహితుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఆకలితో అలమటించే వారికి ఆహారాన్ని అందజేయడమే హ్యుమానిటీ క్లబ్ లక్ష్యమని తెలిపారు. 2028 సంవత్సరం నాటికీ పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమం కార్యరూపం దాల్చే అవకాశం ఉందన్నారు. కార్యాచరణలో భాగంగా 30 మంది ఫ్యామిలీలు ఒక యూనిట్‌గా, పది యూనిట్లు ఒక డివిజన్‌గా, పది డివిజన్‌లు ఒక జోన్‌గా, పది జోన్లు ఒక రీజియన్‌గా, అలాగే పది రీజియన్లు స్టేట్‌వింగ్‌గా రూపొందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ హ్యుమా నిటీ క్లబ్ ద్వారా రోజుకు పదివేల మంది అన్నార్థులకు ఆకలి తీర్చడం సంకల్పంగా పెట్టుకున్నామన్నారు. హ్యుమానిటీ క్లబ్ సభ్యులు ఎటువంటి సభ్యత రుసుము చెల్లించనవసరం లేదన్నారు. కేవలం తమ పరిధిలో ఆకలిగా ఉన్న వారిని గుర్తించి వారికి ఆహారాన్ని అందజేయటమే వారి విధి అని పేర్కొ న్నారు. కార్యక్రమానికి మోడరన్ విద్యాసంస్థలతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలని కోరారు. హ్యుమానిటేరియన్ క్లబ్బు ప్రతిపాదనను కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో ఈ కార్యక్ర మం పూర్తిస్థాయిలో విజయవంతం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.



ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, మోడరన్ అధినేత జివి.రావు

సిలిండర్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వంట గ్యాస్ సిలిండర్ వినియోగంలో తగు జాగ్రతలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని ఇండెన్ గ్యాస్ సేల్స్ మేనేజర్ ఎస్.కావ్య చరిత పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ పి.లక్ష్మీ ప్రశాంతి అధ్యక్షతన గురువారం శ్రీశాంత్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ ఎం.త్రినాథ్ సారథ్యంలో వంట గ్యాస్ సిలిండర్ వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇండేన్ గ్యాస్ సేల్స్ మేనేజర్ కావ్య చరిత మాట్లాడుతూ వినియోగదారులు వంట గ్యాస్ వినియోగంలో అన్ని వేళలా తగు జాగ్రతలు పాటించాలన్నారు. ముఖ్యంగా గ్యాస్ సిలెండర్ రెగ్యులేటర్ నుండి పొయ్యికి గ్యాస్‌ను సరఫరా చేసే పైప్‌లైన్ నిర్ణీత కాలవ్యవధిలో మార్చుకోవడం ద్వారా ప్రమాదాలుసంభవించకుండా జాగ్రత్త పడవచ్చునన్నారు. అలాగే పొయ్యికి గ్యాస్ సిలిండర్ దిగువన ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్యాస్ సిలిండర్ ఉన్న గదిలో వెంటిలేషన్ ఉండే విధంగా జాగ్రతలు పాటించాలని, కంపెనీ సూచించిన జాగ్రతలు ఎల్లవేళలా పాటించి ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. డిస్ట్రిబ్యూటర్ త్రినాథ్ మాట్లాడుతూ గ్యాస్ సిలెండర్ లో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే గ్యాస్ డెలివరి బాయ్‌కు ఫోన్ చేసి ప్రమాదాలు సంభవించకుండా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆనంతరం విద్యార్థిని, విద్యార్థులకు వంట గ్యాస్ సిలిండర్ వినియోగంగా డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో విల్లా బాబీ, బుద్ధ, భవాని డెలివరి బాయ్ ప్రసాద్, కుమార్,మణికంఠ లతో పాటు పలువురు పాల్గొన్నారు.



విద్యార్థులకు గ్యాస్ సిలిండర్‌పై అవగాహనా సదస్సు

గజవాహనంపై దర్శనమిచ్చిన శ్రీనివాసుడు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా 7వ రోజు గురువారం గజవాహనంపై శ్రీనివాసుడు రాజాధిరాజ అలంకరణలో యాత్రికులకు దర్శనమిచ్చాడు. పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో లక్ష తులసి పూజ, తిరుప్పావడ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎంఎల్ఎబండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిసి నల్లం సూర్య చక్రధర్‌రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దేవస్థానం నూతనంగా తీసుకువచ్చిన కళ్యాణం లడ్డూను ఆయన ఆవిష్కరించారు. రాత్రి 8 గంటలకు రాజాధిరాజ అలం కరణలో గజ వాహనంపై వెంకన్న ఆలయ మాడవీధులలో విహరించారు.



గజవాహనంపై ఊరేగుతున్న వెంకన్న

రిలే దీక్షపై స్పందించని అధికారులు

సిపిఎం నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను పునరుద్ధరించి, బస్సులను నడపాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవి కుమార్ రిలే దీక్షలు చేస్తున్నా యంత్రాంగం స్పందించకపోవడం దుర్మార్గపు చర్య అని సిపిఎం నాయకుడు సఖిలే సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సమైక్యాంధ్ర శిబిరం వద్ద రవికుమార్ చేస్తున్న రిలే దీక్ష గురువారం ఆరోరోజుకు చేరుకుంది. ఈ దీక్షకు సిపిఎం, బిఎస్‌పి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సూర్య నారాయణ మాట్లాడుతూ ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యంతో ఐదేళ్లగా బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్ ల కోసం రోడ్డు పక్కన నిరీక్షించాల్సిన పరిస్థితులలో, ప్రజల ప్రయోజనార్థం రవికుమార్ రిలే నిరాహార దీక్ష చేస్తున్నా అధికారులలో చలనం లేకపోవడాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు పునరుద్ధరించాలని లేని పక్షంలో అన్ని ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రవికుమార్‌కు సంఘీభావంగా సిపిఎం నాయకుడు సఖిలే సూర్య నారాయణ, బిఎస్‌పి నాయకులు వాకపల్లి బీమా రావు, బడుగు భీమేశ్వరరావు, నందికి క్రాంతి కుమార్, దాసరి శ్రీనివాస్, కమిడి శ్రీనివాస్, పందిరి శ్రీనివాసరావు, అడ్వకేట్ కన్నిడి వెంకట రమణ, పలువురు సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు.



రిలే దీక్ష చేస్తున్న రవికుమార్‌కు ప్రజాసంఘాల సంఘీభావం

రామచంద్రపురం డివిజన్ డిప్యూటీ ఇఇగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణ సబ్‌డివిజన్ డిప్యూటీ ఇఇగా ఎస్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈయన రాజమహేంద్రవరం ఎఇగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఇఇగా రామచంద్రపురం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎక్కడ పని చేసిన విష్ణుమూర్తి కాకినాడ బదిలీపై వెళ్లారు. డిప్యూటీ ఇఇగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును ఇక్కడ ఎఇలు, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఉద్యోగ సంఘాలు

బాణసంచా దుకాణాలకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

దీపావళిని పురస్కరించుకుని కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు ఖాళీ స్థలాలను తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ హరీష్‌కుమార్, మండపేట ఫైర్ స్టేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అంగర గ్రామంలోని సినిమా థియేటర్ వెనక భాగంలో ఖాళీ ప్రదేశాన్ని, కోరుమిల్లి గ్రామంలో చెరువు గట్టు వద్ద ఖాళీ స్థలాన్ని, కపిలేశ్వరపురం హైస్కూల్ వద్ద ఖాళీ స్థలాన్ని, టేకి గ్రామంలో వాటర్ ట్యాంక్ వద్ద ఖాళీ ప్రదేశాన్ని తనిఖీ చేసినట్లు వారు తెలిపారు. బాసంచా తాత్కాలిక దుకాణదారులు ఈనెల 19, 20 తేదీల్లో ఆయా ఖాళీ ప్రదేశాల్లో రెండు రోజులు మాత్రమే ప్రభుత్వం నిబంధన మేరకు బాణ సంచావిక్రయాలు జరుపుకోవాలన్నారు. దుకాణాల వద్ద తగినంత ఇసుక, ఇసుక బకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, వాటర్, పొగ త్రాగరాదు తదితర బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. దీనికి వ్యతిరేకంగా వ్యాపారాలు చేసినట్లయితే తాత్కాలిక లైసెన్సులతో పాటు బాణసంచా సామాన్లను సీజ్ చేస్తామన్నారు. కార్యక్ర మంలో ఆర్ఐ అజ్జమ్మ, విఆర్ఒలు, కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న తహసిల్దార్, ఎస్ ఐ, అధికారులు

అప్పనపల్లిలో పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయంలో రెండవ రోజైన గురువారం పవిత్రోత్సవాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంఅ 27 కలశాలతో పంచామృతాలు, సుగంధద్రవ్యాలు, 11 రకాల పళ్ళ రసాలు, జలాలత రుమంజన సేవ ఘనంగా నిర్వహొంచారు. ఆలయ కార్య నిర్వహణఅధికారి ఎం.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి శిష్య బృందం, గుడివాడకు చెందిన చలమచర్ల మురళి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాములు బాలబాలాజీ స్వామి పవిత్రో ఉత్సవాలు నిర్వహించారు. యాత్రికులు పాల్గొన్నారు.



పాలతోడులో పశువులకు వైద్య పరీక్షలు

పశువులకు మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - మండపేట

పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పశుపోషకులు వినియోగించుకోవాలని రాష్ట్ర పశుసంవర్థక శిక్షణా కేంద్రం (మండపేట) జెడి డాక్టర్ వెంకటేశు తెలిపారు. గురువారం పాలతోడు లో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధులు, అల్ట్రాసౌండ్ రెక్టల్ స్కానింగ్, సాధారణ వైద్య పరీక్షలకు సంబంధించి డాక్టర్ పి.నాగ మణి, డాక్టర్ జెఎస్‌వి.సునీల్, డాక్టర్ సుబ్బారావు, ట్రైనింగ్ డాక్టర్లు సుమారు 90 పశువులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా వివిధ రకాల మందులు, మినరల్ మిక్సర్ ప్యాకెట్లు, లి క్విడ్ బాటిళ్లపంపిణీ చేశారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు బొబ్బిలి నాగేశ్వరరావు, కూటమి నాయకులు పిల్లా తాతాలు, యేలేటి వెంకట్రావు, సరాకుల అబ్బులు, బొక్కా రామ కృష్ణ, అన్నందేవుల సూర్యచంద్రరావు, కోడి సుబ్రహ్మణ్యం, అన్నందేవుల వెంకటేశ్వరరావు,తాతపూడి లాజరు,పిల్లా సత్యానందం, అన్నందేవుల వీరఅయ్యప్ప, పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్, పశు వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బౌద్ధ సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కాకినాడ అంబేద్కర్ భవన్ లో ఉపాసక బివి.రమణయ్య పుణ్యానుమోదన స్మృతి బౌద్ధ సదస్సుకు బౌద్ధులంతా తరలివచ్చి జయప్రదం చేయాలని ఉపాసక పిఎస్ఎన్.మూర్తి పిలుపునిచ్చారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక కోర్టు ప్రాంగణంలోని గురువారం బార్ అసోసియేషన్ హాలు నందు బార్ ప్రెసిడెంట్ వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించనున్న బౌద్ధ సదస్సు పాంప్లెట్‌ను మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ ఆశయాలను గ్రామ గ్రామానికి తీసుకువెళ్ళిన తొలి తరం అంబేద్కరైట్ మరియు సాంఘిక సంక్షేమ వసతి గృహాల ఏర్పాటుకు ఆద్యులు మాజీ ఎంఎల్‌ఎ రమణయ్య పుణ్యానుమోదన స్మృతి బౌద్ధ సదస్సుకు అంబేద్కరీయులు, బౌద్ధులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు బీర ప్రసాద బాబు, మట్టపర్తి వెంకటేశ్వర రావు, జివి.రామారావు, కాశి సిద్ధార్థ, టి.శాంతి సుధ, వడ్డి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

ప్రజాశక్తి - రావులపాలెం

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు.గురువారం స్థానిక సిఆర్‌సిలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా సిఆర్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాలు వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంత కుమారి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, డిఎస్‌పి సుంకర మురళీమోహన్, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.నాగమణి, సిఆర్‌సి రూప శిల్పి డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సిఆర్‌సి సభ్యులను అభినందించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యం గా ఉంటుందన్నారు. మహిళలు సమతుల్యమైన పోషక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మన ఇంటి పరిసరాల్లో సేంద్రియ విధానంలో ఆకుకూరలు పండించి వినియోగించుకుంటే ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉండవని సూచించారు. కిశోర బాలికల ఆరోగ్యంపై దష్టి సారించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందచేసే పౌష్టికాహారం తీసుకోవడం మూలంగా గర్భిణులు, శిశువు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సేవాభావంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 4 వందల మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్‌సి అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లిమిల్లి వీరరాఘవరెడ్డి, సేవా విభాగం డైరెక్టర్ సత్తి సూర్యభాస్కరరెడ్డి, నందం వీరవెంకట సత్యనారాయణ, ఓల్డేజ్ హోమ్ అధ్యక్షుడు వేగేశ్న రామరాజు, సిడిపిఒ ఎ.గజలక్ష్మి, తహశీల్దార్ బిఎం ముక్తేశ్వరరావు, సూపర్ వైజర్లు, కూటమి నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణీలు పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0తో రవాణా రంగానికి ఊతం

జిఎస్‌టి 2.0 సంస్కరణలతో రవాణా మరియు లాజిస్టిక్స్ రంగాలకు ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద ఆటో, క్యాబ్, మాక్సి వ్యాన్ డ్రైవర్లు నిర్వహించిన భారీ ర్యాలీలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్, ఆర్‌డిఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4,320 కిలోమీటర్ల కొత్త రహదారులు నిర్మించామన్నారు. ఆటో డ్రైవర్ల సేవ పథకం కింద అర్హులందరికీ రూ.15వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. నూతనంగా అమలులోకి వచ్చిన జిఎస్‌టి 2.0తో వాహనాల కొనుగోలు, నిర్వహణ ఖర్చులు తగ్గాయని, డ్రైవర్లు మరియు వినియోగదారులు లబ్ధి పొందనున్నారని వివరించారు. బస్సులు, మినీ బస్సులు, సరుకు వాహనాలు 28 శాతం నుంచి 18శాతం కి ట్రాక్టర్లు 12 శాతం నుంచి 5 శాతంకి విడిభాగాలు, ఉపకరణాలు 28 శాతం నుంచి 18శాతం కిరవాణా సేవలు, వాహన అద్దెలు 12శాతం నుండి 5శాతంకు థర్డ్ పార్టీ బీమా 12 శాతం నుంచి 5శాతంకు తగ్గిన జిఎస్‌టి ఈ సం స్కరణలతో రవాణా రంగం బలోపేతమవుతుందన్నారు. ప్రతి డ్రైవర్ జిఎస్‌టి 2.0 గురించి అవగాహన పెంచుకోవాలని ఎంఎల్ఎ సూచించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, ఈదాల సత్యనా రాయణ మూర్తి, చిన్నం శ్రీనివాసరెడ్డి, కొప్పిశెట్టి ప్రసాద్, తోట స్వామి తదితరులు పాల్గొన్నారు..



సిఆర్‌సిలో సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ తదితరులు

నేరాలు ఘోరాలు

తాండవ రిజర్వాయర్‌లో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

తాండవ రిజర్వాయర్‌లో పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తాండవ రిజర్వాయర్‌లో ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారంతో సంఘటనా ప్రాంతానికి పోలీసులు చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మతుడు అల్లిపూడి గ్రామానికి చెందిన వడ్లమూరి పెద్దింట్ల అలియా శ్రీను(36) గుర్తించారు. బుధవారం ఉదయం స్నానం చేసి వస్తానని ఇంటి దగ్గర నుంచి వెళ్లిన అతను గురువారం రిజర్వాయర్‌లో మృతి చెంది తేలాడు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం సమీపంలో సూర్యారావుపేటలో భర్తతో వివాదం కారణంగా నాగరాజు శ్రీజ్యోతి (25) బుధవారం ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీజ్యోతి తల్లి దుబాయ్ ఉంటూ ఆమెకు డబ్బులు పంపుతోంది. వీటిని భర్త కృష్ణ తీసుకుని జులాయిగా ఖర్చు చేస్తున్నాడని భార్యాభర్తలు ఇద్దరూ గొడవ పడ్డారు. దీనిపై తీవ్ర మనస్తాపం చెంది శ్రీజ్యోతి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఏడాదిన్నర, ఎనిమిది నెలల కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోసం ఘటనలో యువకునికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

రాజంపేట గ్రామానికి చెందిన యువతిని ఒక యువకుడు పెళ్లి పేరుతో మోసం చేసిన సంఘటనలో కోర్టు నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించింది. పెళ్లి పేరుతో నమ్మించి, ఆమె నుంచి సుమారు రూ. 8 లక్షల నగదు, మూడు కాసుల బంగారాన్ని అపహరించినట్లుగా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం వెలగపెల్లికి చెందిన చిట్టి పైడిరాజు అలియాస్ గూగుల్, అలియాస్ యశ్వంత్ రాజ్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ డి.రాంకుమార్ తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో వృద్ధునికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

రాపాక గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధుడు, అదే గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన సంఘటనలో పోలీసులు నిందితుని అరెస్టు చేశారు. రాపాక గ్రామానికి చెందిన బావిశెట్టి మంగయ్య అదే గ్రామానికి చెందిన వృద్ధురాలిపై బుధవారం అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యా దు చేశారు. పోలీసులు మంగయ్యను అరెస్టు కోర్టులో హాజ రు పరిచారు. న్యాయమూర్తి నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

ఆస్తి కోసం తల్లిదండ్రులు, సోదరునిపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడిలో ఆస్తి వివాదాల కారణంగా కుటుంబ సభ్యుల మధ్య కలహాలు తలెత్తాయి. మాధవరపు సత్యనారాయణ కుమారుడైన రవికుమార్ తన అన్నలు మాధవరపు శ్రీనివాసరావు, మాధవరపు చంద్రగిరి, మాధవరపు శివనాగ సత్యసాయిపై సీతానగరం మండల పోలీసులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. తన అన్నదమ్ములు కలిసి తమ తల్లిదండ్రులు మాధవరపు సత్యనారాయణ, సత్యవతిని ఆస్తి కోసం చిత్రహింసలకు గురిచేస్తున్నారని తెలిపారు. అక్టోబర్ 14 రాత్రి 9 గంటలకు తల్లిని జుట్టు పట్టి కిందకు ఈడ్చి దవడపై కొట్టారని, అడ్డుకోవడానికి ప్రయత్నించిన తనపై ముగ్గురూ కలిసి కొట్టారని తెలిపారు. తమ ఇంట్లో తల్లి దండ్రులకు, తమకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశా రు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణంలో పలు హోటళ్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ ఛానెల్స్‌లో బిర్యానీలో మండ్రకప్ప అవశేషాలు అంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో అధికారులు ఈ దాడులు చేపట్టారు. ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి జె.రామయ్య, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. వంటశాల పరిశుభ్రత, ఆహార పదా ర్థాల నాణ్యత, లైసెన్స్ వివరాలు తదితర అంశాలను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు.


ఐడి కార్డులు, డైరీలు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకు ఐడి కార్డుల అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రఘుదేవపురం పిఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు నూతన ఐడి కార్డులు, డైరీలను పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం ఎం.శ్యామలా దేవి గురువారం తెలిపారు. పిల్లల భద్రత కోసం చైల్డ్ ట్రాకింగ్ సదుపాయం గల అధునాతన ఐడి కార్డులను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు రోజువారీ హోమ్ వర్క్ వివరాలను తల్లిదండ్రులకు తెలియజేసే విధంగా ప్రత్యేకంగా రూపొందించిన డైరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ పిల్లి జ్యోతి, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పంచారామాల ప్యాకేజీ కరపత్రాలు విడుదల చేస్తున్న డిపో మేనేజర్

ఆర్‌టిసి పంచారామ క్షేత్రాల బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎపిఆర్‌టిసి రామచంద్రపురం డిపో శివ క్షేత్రాలైన పంచారామాల బస్సు ప్రత్యేక ప్యాకేజీ కరపత్రం గురువారం విడుదల చేశారు. డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ని కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. బస్సు సరి పడా జనం ఉంటే వారి గ్రామానికి వచ్చి శివ క్షేత్రాలను దర్శించి తిరిగి వారి గ్రామానికి తీసుకు వస్తారని అన్నారు. ఈనెల 26 నుంచి వచ్చే నెల 17 వరకు ఈ స్పెషల్ ప్యాకేజీ ఏర్పాటు చేశామని ఈ సందర్భ ంగా డిపో మేనేజర్ వివరించారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్, ట్రాఫిక్ ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


సఖినేటిపల్లి గ్రామపంచాయతీ వద్ద గ్రామసభ

పంచాయతీ విభజనకు వ్యతిరేకంగా గ్రామస్తుల ఓటు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

సఖినేటిపల్లి గ్రామ మేజర్ పంచాయతీ విభజనకు గ్రామస్తులు వ్యతిరేకంగా ఓటు వేశారు. సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిగ్రామ మేజర్ పంచాయతీనీ రెండుగా విభజించాలనే అజెండాతో సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. సోమవారం గ్రామసభ అంటూ, గ్రామ ప్రజలంతా పాల్గొనాలని మైక్ ప్రచారం చేయగా ఆ రోజు భారీ వర్షం కారణంగా గ్రామ సభను పంచాయతీ కార్యదర్శి తాడి యేసు గురువారానికి వాయిదా వేశారు. గ్రామసభతో సఖినేటిపల్లి మేజర్ పంచాయితీనీ రెండుగా విభజన చేస్తారనే ప్రచారం గ్రామం అంతా చర్చంశానీయంగా మారడంతో మెజారిటీ ప్రజలు విభజనను వ్యతిరేకిస్తూ గ్రామసభకు హాజరై తమ ఓటును విభజనకు వ్యతిరేకంగా వేశారు. ఓటింగ్లో పాల్గొన్న వారిలో 114 మంది వ్యతిరేకించగా 18 మంది అనుకూలంగా ఓటు వేశారు. జనసేన నాయకులు మాత్రం పంచాయతీ రెండుగా విభజించాలనే వాదన వినిపించగా, టిడిపి నాయకులు కొందరు, వైసిపి నాయకులు, సాధారణ ప్రజ లు విభజనకు వ్యతిరేకంగా ఓటు వేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి యేసు చేతులు పైకె త్తించే విధానంలో వోటింగ్ పద్దతి సాగించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కో ఆప్షన్ సభ్యులు బళ్ళ నోబుల్ ప్రభాకర్, మాజీ సర్పంచ్లు జంపన రామకృష్ణంరాజు, రావి ధర్మరావు, నీటి సంఘం అధ్యక్షులు నామన నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆర్ఐ పికెడి.ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నిడదవోలులో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా సేవలందించి, ఉదోన్నతిపై ఉండ్రాజవరం మండల ఆర్ఐగా బుధవారం బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. తమ సిబ్బంది అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు.

బాణసంచా విక్రేతలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

దీపావళి బాణాసంచా విక్రయించే దుకాణాల వద్ద ప్రమాదాల నివారణకు దుకాణదారులు ముందస్తుగా అన్ని జాగ్రత్తలూ పాటించాలని తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. గురువారం మండల కేంద్రం ఉండ్రాజవరంలో అనుమతి పొందిన బాణసంచా దుకాణదారులు దుకాణాలు ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. చిన్న పొరపాటుకు పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది కనుక ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. దుకాణదారులు తప్పనిసరిగా అన్ని జాగ్రత్తలూ పాటించాలన్నారు. ముందస్తు జాగ్రత్తగా ఇసుక, బకెట్లలో నీరు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణాల వద్ద అగరబత్తులు ముట్టించవద్దన్నారు. కొనుగోలుదారులు, ప్రజలు, ఎవరైనా దుకాణాల వద్ద సిగరెట్లు తాగకుండా చూసుకోవాలన్నారు. ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎఇ రమేష్‌బాబు, నిడదవోలు ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ సిహెచ్‌బివిఎస్.రాజు, విఆర్‌ఒ పాపారావు, దుకాణదారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డిఒ పి.శ్రీకర్

పెండింగ్ కేసులపై నివేదిక ఇవ్వాలి

ప్రజాశక్తి - కొత్తపేట

పెండింగ్ కేసులపై త్వరితగతిన తదుపరి చర్య, నివేదికలు వెంటనే పంపవలసినదిగా ఎస్‌సి, ఎస్‌టి మోనిటరింగ్ కమిటీ ఛైర్మన్ మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి పి.శ్రీకర్‌కోరారు. వారి సమక్షంలో ఎస్‌సి, ఎస్‌టి మోనిటరింగ్ కమిటీ సమావేశం గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేశారు. సమావేశానికి డిఎస్‌పి యస్.మురళీమోహన్, కమిటీ సభ్యులు అం దరూ హాజరయ్యారు. ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే సదరు విషయాలను కమిటీ దృష్టికి తీసుకోనిరావాలని కమిటీ సభ్యులను కోరారు. ప్రతి 3 నెలలకొకసారి నిర్వహించే ఈ సమావేశానికి ముందస్తుగా సమస్యలను/సలహాలను, సూచనలు పంపించాలన్నారు. సమస్యలపై తీసు కొన్న చర్యలను తెలియజేసే నివేదికలు సమర్పించాలన్నారు. సమావేశంలో కొత్తపేట డివిజన్ లోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎఎస్‌డబ్ల్యూఒ కొత్తపేట, రెవెన్యూచ పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొండవరం గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ చట్టం పనులను ఎంపిడిఒ లక్ష్మీ రెడ్డి గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ చట్టంలో అవకతవకులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

లక్ష్మణరావుకు డాక్టర్ శ్రీకాంత్ నివాళి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

చల్లపల్లి పంచాయతీ జగ్గరాజు పేటకు చెందిన వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్ తండ్రి లక్ష్మణరావు(70) అమలాపురం ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురు వారం మృతి చెందారు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మణరావు భౌతిక కాయానికి వైసిపి అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


లక్ష్మణరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న శ్రీకాంత్


కరపత్రాన్ని విడుదల చేసిన జెఎసి

ఆలమూరు విలీనంపై జెఏసి కార్యాచరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలో కలపాలనే డిమాండ్‌పై జెఎసి ఏర్పాటైన విషయం విదితమే. ఈ మేరకు గురువారం జెఎసి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సమత కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో కార్యాచరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజలు, ఉద్యోగులు అందరూ ముక్తకంఠంతో ఆలమూరు మండలాన్ని రాజమహేంద్రవరంలో కలపాలని కోరుకుంటున్నారన్నారు. మన పక్క నియోజకవర్గమైన మండపేటను కోనసీమ నుంచి వేరుచేసి రాజమహేంద్రవరంలో కలపాలని అక్కడ ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రభుత్వం దృష్టికి, జిల్లాల విభజన కమిటీ దష్టికి తీసుకెళ్లామన్నారు. మన ఆలమూరు మండల జెఏసి నాయకుల ఆధ్వర్యంలో మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నేతలు, ప్రజలందరూ కలసి ప్రస్తుత మన శాసనసభ్యులైనటువంటి బండారు సత్యా నంద రావు దష్టికి మన ఆవేదనను మన మండలం నుంచి అమలాపురం వెళ్లడానికి, పడే ఇబ్బందులను తీసుకువెళ్లి మన మండలాన్ని రాజమహేంద్రవరంలో కలిపేలా ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్ల వలసిం దిగా ఎంఎల్ఎను జెఏసి కోరేందుకు తీర్మానించారు. ఈ నెల 27న ఈ కరపత్రాలతో పాటు స్థానిక తహ శీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ లకు వినతి పత్రాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు నాతి కుమార్ రాజా, కొండే రామకష్ణ, కొపనాతి శ్రీనివాసరావు, తాడి మధుసూదన్ రెడ్డి, యాళ్ల రవిరాజ్, కట్ట సత్య ప్రసాద్, మిద్దె పురుషోత్తం, తాడి రామకృష్ణారెడ్డి, శరబందు రాజు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

విశాఖలో గూగుల్ సంస్థ రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ అన్నారు. గురువారం పట్టణంలో గూగుల్ రాకపై టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినందుకు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, మాజీ జడ్‌పిటిసి మడికి ప్రసాద్, టిడిపి నాయకులు గుళ్ళ సుబ్బారావు, పాల్గొన్నారు.


రతీదేవిని సన్మానిస్తున్న ఛైర్మన్ తదితరులు

ఎఎంసి వైస్ ఛైర్మన్ రతీదేవికి ఘన సన్మానం

ప్రజాశక్తి-నిడదవోలు

నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా నియమితులైన నిడదవోలు మున్సిపల్ కౌన్సిలర్ పువ్వుల రతీదేవిని గురువారం పురపాలక సంఘం కార్యాలయంలో ఛైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 20 ఏళ్ల సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ కౌన్సిలర్‌ను అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా ఎంపిక చేయడం హర్షణీయం అన్నారు. మున్సిపల్ కమిషనర్ తోట శ్రీకృష్ణవేణి, కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది, రతి దేవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఈ శాఖకు, ఈ పదవికి మరింత వన్నె తెచ్చే విధంగా కృషి చేస్తానని, నిడదవోలులో వ్యవసాయ మార్కెట్ యార్డ్ నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్, సింగవరం సొసైటీ ప్రెసిడెంట్ పెన్మత్స చందు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై శిక్షణ

ప్రజాశక్తి - కరప

గురజనాపల్లి ప్రభు త్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యా యులకు సిపిఆర్‌పై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హెచ్‌ఎం సాయిమోహన్ తదితరులు పాల్గొన్నారు.


పాతకోట వంతెన ఇదే

శిథిలావస్థకు పాతకోట వంతెన

- శంకుస్థాపన చేసి ఆరేళ్లు
- వంతెన పూర్తయ్యేది ఎప్పటికో?

ప్రజాశక్తి - రామచంద్రపురం

బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుని పాతకోట గ్రామ ప్రజలను ప్రయా ణికులను భయాం దోళనలకు గురిచేస్తుంది. కె.గంగవరం మండలంలోని పాతకోట గ్రామానికి నిర్మించిన వంతెన కూలడానికి సిద్ధంగా ఉంది. పాత కోట గ్రామ ప్రజలు కోటిపల్లి ద్రాక్షారామ చేరుకునేందుకు ప్రధాన రహదారి ఈ వంతెన పైనుండే ఉంది. సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో 2019లో అప్పటి ఎంఎల్ఎ తోట త్రిమూర్తులు ఈ వంతెన నిర్మాణానికి నిధులు మం జూరు చేయించారు. రూ.17 లక్షలతో దీనికి శంకుస్థాపన చేశారు. ఆరేళ్లు గడిచి పోయినా పనులు మొదలు కాలేదు. తర్వాత ప్రభుత్వం మారడంతో దీనిని పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. వైసిపి ప్రభుత్వం తర్వాత గత ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం ఈ వంతెన నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించాలని లేని పక్షంలో పాతకోట ప్రజలకు మొన్న ఏకైక మార్గం ఈ వంతెన కూలిపోతే ఇక్కట్లకు గురి కావాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వెంటనే ఇరిగేషన్ జల వనరుల శాఖ అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని పునఃప్రారంభించాలని పాతకోట గ్రామ ప్రజలు, ప్రయాణికులు అధికారులను ప్రజాప్రతినిధులను కోరు తున్నారు. ఈ వేసవిలో ఈ పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


2019లో వేసిన శిలాఫలకం